చెరువంతా గుర్రపు డెక్క!

పరికి చెరువులో పేరుకుపోతున్న గుర్రపు డెక్క

- నామమాత్రంగా తొలగిస్తున్న వైనం
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పరికి చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పరికి చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపునకు కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా గుర్రపు డెక్కను కొంతమేర తొలగిస్తూ బిల్లులు పొంది మమా అనిపించారు. ఒప్పందంలో ఉన్నది ఒకటయితే వారు చేసింది మరొకటి. 2021 జనవరిలో కాంట్రాక్టర్లు గుర్రపుడెక్క తొలగించి తరలించేందుకు వారికి సుమారు 3 సంవత్సరాలు లీజుకు ఇచ్చారు. కానీ వారు నామమాత్రంగానే గుర్రపు డెక్కను తొలగించి చేతులు దులుపుకున్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చేటప్పుడు చెరువు శుభ్రంగా ఉందా లేదా అని పరిశీలించిన తర్వాతనే చెల్లించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్లు ఇచ్చిన మాముళ్లకు అలవాటు పడిన సంబంధిత అధికారులు చెరువును పరిశీలించకుండానే వారు చెప్పింది విని బిల్లులు చెల్లించారు.

చెరువు చుట్టూ 40 కాలనీలు..

అధికారులు కఠినంగా వ్యవహరించకపోవటంతోనే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం కారణంగానే గుర్రపు డెక్క పెరుగుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొలగించిన గుర్రపుడెక్కను అక్కడే వేయటంతో తిరిగి చెరువువంతా విస్తరిస్తోంది. దీంతో చెరువులో పచ్చటి మైదానంలా తలపిస్తూ దోమలు పెరిగి, దుర్గంధం వెదజల్లుతోంది. పరికి చెరువు చుట్టూ సుమారు 40 కాలనీలు, 20 బస్తీలు ఉన్నాయి. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కకు తోడు మురుగు నీరుచేరి దుర్గంధం, దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు, విష పురుగులకు ఆవాసంగా మారింది. వర్షాకాలంలో విష పురుగులు, సర్పాలు ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని ఆయా కాలనీలవాసులు వాపోతున్నాఉ.

ఉత్తుత్తి హామీలు..

పేరుకుపోయిన గుర్రపు డెక్క కారణంగా సాయంత్రం అయిందంటే దోమల దండయాత్ర మొదలవుతోందని, కంటిమీద కునుకు లేకుండా పోతోందని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు. వర్షాకాలం, శీతాకాలంలో సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్నామని పేర్కొంటున్నారు. గతంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పరికి చెరువును సందర్శించి గుర్రపు డెక్కను తొలగించి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, అందమైన పూలమొక్కలను ఏర్పాటు చేసి స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు కానీ.. ఆ మాటలు నీటిమీద బుడగల్లాగే ఉండి పోయాయని స్థానికులు తెలుపుతున్నారు.

గుర్రపు డెక్కను తొలగించాలి..



పరికి చెరువులో గుర్రపుడెక్కను తొలగించేందుకు కోట్ల రూపాయలు వృథా చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా ప్రజా సొమ్ము దుర్వినియోగం అవుతుంది. గుర్రపుడెక్కతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలి.
– చంద్రశేఖర్ రెడ్డి, తులసినగర్ అధ్యక్షుడు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న వేం నరేందర్ రెడ్డి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కల్చర్, వెల్ఫేర్, స్పోర్ట్స్ గౌరవ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సీఎం వాలీబాల్ టోర్నమెంట్ కప్ వాల్‌పోస్టర్‌ను శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరావు, నాగిరెడ్డి, తూము వేణు, మొయినుద్దీన్, ప్రవీణ్ కుమార్, నరసింహ, కొండల్ రెడ్డి, రేష్మ, కుమ్ము బాబూ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

బాలానగర్: బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడకు చెందిన చాకలి రాములుకు మంజూరైన రూ. 60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, రాములు కుటుంబ సభ్యులకు అందజేశారు.

మున్సిపల్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోకి తీసుకోవాలి

మూసాపేట: హైడ్రా విభాగం నుంచి తిరిగి మున్సిపల్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోకి తీసుకోవాలని శనివారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ అధ్యక్షులు గడ్డం జగదీష్ మాట్లాడుతూ.. సిబ్బందిని హైడ్రాలోకి తీసుకున్నారని వారిని తిరిగి జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సోమయ్య, మురళి, భిక్షపతి, నాగబాబు, సాగర్, నరేష్ పాల్గొన్నారు.

మాజీ సైనికుడి నుంచి రూ.52 వేల మద్యం స్వాధీనం

కుత్బుల్లాపూర్: మిలటరీ మద్యం సీసాలు విక్రయిస్తున్న మాజీ సైనికుడిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ వివరాల ప్రకారం .. చింతల్ శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన కాటమల నాగేందర్‌రావు(59) మాజీ సైనికుడు. ప్రస్తుతం ఆయన ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. నాగేందర్‌రావు కొంత కాలంగా మిలటరీ మద్యాన్ని విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అతని ఇంటిపై దాడి చేసి రూ.52 వేలు విలువ చేసే 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నర్సిరెడ్డి, ఎస్ఐ పవన్ కుమార్ రెడ్డి, సిబ్బంది సత్తార్, సంజయ్ ఈ దాడిలో పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు స్థలాల వేలాన్ని అడ్డుకుంటాం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



విలేకరులతో మాట్లాడుతున్నఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: హౌసింగ్ బోర్డు స్థలాలను వేలంపెట్టి, రాష్ట్ర ప్రభుత్వం అమ్ముకోవాలని చూస్తే ఊరుకోబోమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన కేపీహెచ్‌బీ డివిజన్‌లో స్థానిక డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎప్పుడు పాలించినా హౌసింగ్ బోర్డులోని స్థలాలను అమ్ముకోవాలని చూస్తుందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో హౌసింగ్ బోర్డు కాలనీని అభివృద్ధి చేసిందన్నారు. నాటి ప్రభుత్వం హయాంలో 24 ఎకరాల హౌసింగ్ బోర్డు భూమిని సుప్రీం కోర్టుకు వెళ్లి కాపాడుకోవటం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేయటం మానేసి భూములను అమ్మి హైదరాబాద్‌ను నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. 6 గజాల నుంచి 30 గజాల వరకు వేలం నిర్వహించటం దుర్మార్గమైన చర్య అని జీఓ నెంబర్ 6 ప్రకారం హౌసింగ్ బోర్డు స్థలం, పక్కన ఉన్న వారికి ప్రాధాన్యం దక్కుతుందని, ప్రజా ప్రయోజనం కోసం వదిలివేసిన హౌసింగ్‌బోర్డు స్థలాన్ని వేలం వేయరాదన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి..

మూసాపేట: డ్రైనేజీ వ్యవస్థ భూమిలోకి కుంగి తాగునీటి పైపులైన్‌లో కలువడంతో మంచినీళ్లు కలుషితమవుతున్నాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో ఆయన మాజీ కార్పొరేటర్ బాబూరావుతో కలిసి పర్యటిస్తూ మాట్లాడారు. కోర్టు నిర్మాణం చేపట్టిన సమయంలో డ్రైనేజీ ఔట్‌లెట్ పూర్తిగా కుంగిపోవటంతో మురుగునీరు ఓవర్ ఫ్లోతో కాలనీలో భూగర్భ డ్రైనేజీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. భూగర్భ డ్రైనేజీ లైన్లను పరిశీలించి నూతన మంచినీటి పైపులైన్లు నిర్మించి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఈఈ శ్రీనివాస్, వాటర్‌వర్క్స్ జీఎం ప్రభాకర్, నాయకులు ప్రభాకర్ గౌడ్, యాదయ్య, సాయికిరణ్, డీఈ శంకర్, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

జేఎన్‌టీయూ సందర్శన

కేపీహెచ్‌బీకాలనీ: హిమాచల్‌ప్రదేశ్ పట్టణ,గ్రామీణ ప్రణాళిక, గృహ నిర్మాణం, సాంకేతిక విద్య, వృత్తి, విద్యా, పారిశ్రామిక శిక్షణ శాఖ మంత్రి రాజేష్ ధర్మాణి శనివారం జేఎన్‌టీయూహెచ్‌ను సందర్శించారు. తెలంగాణలోని ప్రముఖ విశ్వ విద్యాలయాల పర్యటనలో భాగంగా శనివారం ఆయన జేఎన్‌టీయూను సందర్శించగా వీసీ డాక్టర్ బాలకిష్టారెడ్డి, రెక్టర్ డా. కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు మంత్రి బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధిపతులను పరిచయం చేసి, వారు విశ్వ విద్యాలయం అభివృద్ధికి అందిస్తున్న సేవలను మంత్రి బృందానికి వివరించారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు విశ్వ విద్యాలయం దిశ, లక్ష్యాల సాధనలపై పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు.



లెప్రసీ రోగులను మనలో ఒకరిగా చూడాలి

మోతీనగర్: కుష్టు వ్యాధి గ్రస్థులను వేరుగా చూడకుండా మనలో ఒకరిగా చూడాలని పర్వత్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా పేర్కొన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లోని గ్రేస్ సొసైటీ సంస్థ అధ్యక్షుడు జాకోబ్ ఆధ్వర్యంలో 100 మంది లెప్రసీ కుటుంబాలు, రాజీవ్ గాంధీ నగర్‌లో 70 మంది కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ.. లెప్రసీ రోగులకు ఆసరా పింఛన్‌తో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం వారికి మెరుగైన వైద్యం అందిస్తూ నెలలో ఒక్కసారైనా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే చౌకధర దుకాణాల్లో వారి వేలిముద్రలు రావడం లేదని అలాంటి వారికి వేలిముద్రలతో సంబంధం లేకుండా నిత్యావసర వస్తువులను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సింహాచలం, జోసెఫ్ స్లాప్, రమేష్, మురళి, కృష్ణారెడ్డి, సతీష్, స్థానిక నాయకులు మణెమ్మ, పి. అంకమ్మ, సరోజ, మోహన్ పాల్గొన్నారు.

వేమన పద్యాలను నేర్చుకోవాలి

రాయదుర్గం: వేమన పద్యాలను పాఠశాల స్థాయిలోనే నేర్చుకోవాలని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ ప్రిన్సిపల్ మురళి విద్యార్థులకు సూచించారు. వేమన జయంతిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు నైతిక విలువలు, సమాజం, కుటుంబ బాధ్యతలను నెరవేర్చడంపై చక్కటి పద్యాలను వేమన రాశారన్నారు. అనంతరం విద్యార్థులకు పద్యాల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. అధ్యాపకుడు డాక్టర్ లంక పార్థసారథి ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



వంశీ కృష్ణ

కేపీహెచ్‌బీకాలనీ: తండ్రి మందలించాడని ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట రోడ్డులో భవ్యాస్ శ్రీనివాస్ అపార్టుమెంట్‌లో నివాసముండే దొడ్డిపట్ల నాగరాజు కుమారుడు వంశీకృష్ణ (17) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి వంశీకృష్ణ సెల్‌ఫోన్ చూస్తూ కనిపించడంతో చదువుపై దృష్టి పెట్టాలని తండ్రి మందలించగా కాసేపటి తర్వాత ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన పెట్టి వంశీ కృష్ణ ఎంతకీ రాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కృత్రిమ కాళ్ల అందజేత



కృత్రిమ కాళ్లను అందజేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

కూకట్‌పల్లి: ప్రకాష్‌నగర్ వాక్స్ క్లబ్ కూకట్‌పల్లి ఆధ్వర్యంలో భారత్‌వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. అధ్యక్షుడు కె. మంకయ్య, సెక్రటరి బి. రంగారావు, ట్రెజరర్ సత్యనారాయణలు, మరి కొందరు దాతలతో కలిసి కృత్రిమ కాళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్‌బాబు, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, శివాజీ పాల్గొన్నారు.

సనాతన ధర్మం ఆడియో ఆవిష్కరణ



సుభాష్‌నగర్: సనాతన అంటే ఎల్లప్పుడు ఉండేదని, అదీ అంతం లేనిదని, అదే మన సనాతన ధర్మం గొప్పతనమని హాస్య బ్రహ్మ డాక్టర్ శంకర నారాయణ అన్నారు. శనివారం సూరారం కాలనీలోని కల్యాణ రామచంద్రస్వామి ఆలయంలో సనాతన ధర్మం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక, సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ, నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సనాతన ధర్మం గొప్పతనాన్ని చాటుతూ రంగరాజు రంగారావు ఒక అద్భుతమైన పాటను రాయడం, దానికి రాయారావు విశ్వేశ్వర్ రావు స్వరకల్పన చేయడం అభినందనీయమన్నారు. నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోగులపాటి కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీరామాలయం కమిటీ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, స్వరకల్పన రాయారావు విశ్వేశ్వర్ రావు, మంత్రి శేషారావు, ఆలయ ప్రధాన కార్యదర్శి సామంతపూడి మోహనరాజు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్రా..సందడి!

- సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికపై కొనసాగుతున్న సర్వే
- రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికే కీలకం
- కొత్త నిబంధనలతో సర్వత్రా చర్చనీయాంశంగా మారిన వైనం..
- గ్రామ/వార్డు సభల నిర్వహణకు కార్యాచరణ



సాక్షి,సిటీబ్యూరో: సంక్రాంతి సందడి ముగిసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో కొత్త సంక్షేమ పథకాల సందడి మొదలైంది. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల అమలును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. దీంతో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను గత గురువారం నుంచి మొదలుపెట్టారు. రెండు, మూడు రోజులుగా పురపాలక సంఘాలు, గ్రామాల్లో ప్రత్యేక బృందాల పరిశీలన, హడావుడి కనిపిస్తోంది. ఈ నెల 20 వరకు నాలుగు పథకాల ఆశావహుల వివరాల పరిశీలన కొనసాగనుంది. ఆ తర్వాత 21 నుంచి 24 వరకు గ్రామ/వార్డు సభల్లో అభ్యంతరాలను పరిశీలించి లబ్ధిదారుల జాబితా రూపొందించనున్నారు. ఈ మేరకు గ్రామ/వార్డు సభల నిర్వహణపై జిల్లా అధికార యంత్రాంగం పక్కాగా కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయటం ద్వారా ముందుకు సాగుతోంది.

శాఖల వారీగా బాధ్యతలు

లబ్ధిదారుల గుర్తింపులో ముఖ్య బాధ్యతలను స్థానిక తహసీల్దార్లు, మండలాభివృద్ధి అధికారులకు ప్రభుత్వం అప్పగించింది. వీరి పర్యవేక్షణలో మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తదితర సిబ్బందితో కూడిన బృందాలు సర్వే చేపడుతున్నాయి. ఏవోలు, ఏఈవోలు..రైతు భరోసా, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు.. రేషన్ కార్డులు, ఉపాధి హామీ అధికారులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే తుది దశకు చేరుకోవటంతో సంబంధిత కమిటీలు త్వరలో గ్రామ/వార్డు సభలు నిర్వహిస్తాయి.

పెట్టుబడి సాయానికి 'సాగు యోగ్యత'

'రైతుబంధు' తరహాలో కాకుండా కేవలం సాగు భూములకు ఏడాదికి ప్రస్తుతం రూ.12 వేల పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వ నిర్ణయింది. ఈ నేపథ్యంలో వ్యవసాయేతర, సాగు యోగ్యం కాని భూముల వివరాలను ఏఈవోలు గ్రామాల వారీగా పకడ్బందీగా పరిశీలిస్తున్నారు. వివరాల్లో తప్పులుంటే చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించిన నేపథ్యంలో పారదర్శక పరిశీలన కొనసాగుతోంది.

సాగు చేయని భూములకు రైతు భరోసా కట్

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 40,960 మంది రైతులకు సంబంధించి 77,984 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, ఇందులో ప్రతి ఏటా వానాకాలం సీజన్‌లో 35 వేల ఎకరాలు, యాసంగిలో దాదాపు 24 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 50 శాతం భూముల్లో పంట సాగు కావటం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తాజా నిర్ణయంతో ఈ సాగులో లేని 50 శాతం భూములకు భరోసా దక్కదని భావిస్తున్నారు.

'ఇందిరమ్మ కమిటీ'లే కీలకం

జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయటానికి కసరత్తు మొదలైంది. తొలి విడత ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 17,500 ఇళ్లు మంజూరు చేయనున్నారు. దరఖాస్తుల సర్వే, తుది పరిశీలన (సూపర్ చెక్) ఇప్పటికే పూర్తవగా, తాజాగా గ్రామ, వార్డు సభల్లో ఇందిరమ్మ కమిటీల ఆమోదంతో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

భూమిలేని వారికే ఆత్మీయ భరోసా

భూమిలేని నిరుపేద కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేల సాయాన్ని (రెండు విడతలుగా) ప్రభుత్వం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. గతేడాది ఉపాధి హామీ పథకంలో కనీసం 20 పనిదినాలు చేసిన వారిని అర్హులుగా గుర్తిస్తున్నారు. భూమి లేని దరఖాస్తుదారుల వివరాలను ఉపాధి హామీ సిబ్బంది సేకరిస్తున్నారు. జిల్లాలో 18,014 జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 19,387 మంది కూలీలు ఉన్నారు.

నిరీక్షణకు తెరపడేలా..

గతేడాది ప్రజా పాలనలో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది. కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డుల ఎంపికపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం వివిధ మార్గాల్లో 1.89 లక్షల దరఖాస్తులు అందినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. వీరిలో ఎంత మందికి కార్డులు దక్కుతాయో చూడాల్సి ఉంది.

పుస్తెలతాడు లాక్కెళ్లిన నిందితుల అరెస్ట్

దుండిగల్: వృద్ధురాలిని ఏమార్చి ఆమె మెడలోని పుస్తెల తాడును లాక్కెళ్లిన ఇద్దరు నిందితులను దుండిగల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా నూనేపల్లె గ్రామానికి చెందిన కందుల సుదర్శన్‌రావు(26), జనగాం జిల్లా కొడకొండ్ల మండలం ఈదునూతల గ్రామానికి చెందిన పాలాస దామోదర్(25) నగరానికి వలస వచ్చి ఉప్పల్ రామాంతాపూర్‌లోని గణేశ్‌నగర్‌లో నివాసముంటున్నారు. స్నేహితులైన వీరిద్దరు చెడు అలవాట్లకు బానిసై దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉండగా.. బౌరంపేట గ్రామానికి చెందిన చింతకింది శంకరమ్మ (65) తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఈ నెల 11న గ్రామంలోని బొడ్రాయి సమీపంలో ఉన్న శ్రీనివాస క్లినిక్ వెళ్లింది. అక్కడ ఆమెతో మాటలు కలిపిన ఓ యువకుడు క్లినిక్‌లో వైద్య సేవలు ఎలా ఉన్నాయని ఏమార్చాడు. ఎక్కడికి వెళ్తున్నావని అడగడంతో ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న తన ఇంటికి వెళ్తున్నానని బదులు ఇచ్చింది. దీంతో తన బైక్ పై ఇంటి వద్ద దింపుతానని ఆమెను నమ్మబలికి బౌరంపేటకు కాకుండా మల్లంపేట వైపు తీసుకెళ్లాడు. తన స్నేహితుడి సాయంతో ఆమె మెడలోని పుస్తెలతాడును లాక్కుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దుండిగల్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా సుదర్శన్‌రావు, దామోదర్‌లుగా గుర్తించారు. సూరారంలో నిందితులిద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 3.8 తులాల బంగారం, బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జాతరకు పటిష్ట భద్రత

- నేడు చిత్తారమ్మ దేవి ప్రధాన జాతర
- పెద్ద ఎత్తున హాజరుకానున్న భక్తులు



హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతర రెండవ రోజు భక్తుల తాకిడి పెరిగింది. శనివారం గవ్యాంత పూజలు, దేవత హోమాలు, గాజులరామారం నుంచి ఆలయం వరకు పూలగటం ఊరేగింపు జరిగింది. భక్తులు ఉదయం నుండే తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు ప్రధాన జాతర

ఆదివారం అమ్మవారి ప్రధాన జాతరలో భాగంగా తెల్లవారుజామున అభిషేకం, విజయ దర్శనం, ఒడి బియ్యం, 11 గంటలకు బోనాల సమర్పణ, సాయంత్రం పోతరాజులతో ఊరేగింపు, వినోద కార్యక్రమాలు జరుగనున్నాయి. ప్రధాన జాతరకు ఒక రోజు ముందు నుంచే ఆలయానికి ఇరుపక్కల షాపులు వెలిశాయి. ఆలయానికి కిలోమీటర్ మేర వివిధ పార్టీ నాయకులు ఫ్లెక్సీలతో నింపి వేశారు.

భారీ భద్రత

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బాలానగర్ డీసీపీ పరిధిలో ఇద్దరు అడిషనల్ డీసీపీలు, ఇద్దరు ఏసీపీలు, 10 మంది సీఐలు, 24 మంది ఎస్ఐలు, 250 మంది కానిస్టేబుళ్లతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా శనివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వరకు జాతర నేపథ్యంలో షాపూర్ నగర్ గాజులరామారం ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులు పలు ఆంక్షలు విధించారు.

ఎన్‌టీఆర్ కృషి మరువలేనిది



ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి (జోన్ బృందం): కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో శనివారం నిర్వహించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామావు వర్ధంతిలో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ఎన్‌టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ఎన్‌టీఆర్ ఎంతో కృషి చేశారని ఆయన రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శ ప్రాయమన్నారు.